క్లుప్తంగా

రెవెన్యూ కార్యాలయం సందర్శన



హసన్‌పర్తి: సాదా బైనామా క్రమబద్ధీరణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఆర్డీఓ వెంకటేష్ తెలిపారు. హసన్‌పర్తి రెవెన్యూ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించి పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను ఆయన పరిశీలించారు. ఆన్‌లైన్ చేసిన దరఖాస్తులను సరిచూశారు. పెండింగ్ దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రహీం, సీనియర్ అసిస్టెంట్ రజనీకాంత్, ఆర్ఐ ఫాజిల్ ఉన్నారు.

బీజేపీ సంస్థాగత నియామకాలు

హన్మకొండ: భారతీయ జనతా పార్టీలో సంస్థాగతంగా పలు నియామకాలు చేపట్టారు. ఈమేరకు బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా ఉపాధ్యక్షులుగా దాస్యం అభినవ్ భాస్కర్, నర్మెట్ట శ్రీనివాస్‌రావు గౌడ్, ఆకుల శ్రీకాంత్, కార్యదర్శులుగా మార్త రాజభద్రయ్య, సీహెచ్.ప్రభాకర్ రెడ్డిని నియమించారు. బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా సంద్ర మధు, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా మాలోతు తిరుపతి నాయక్, బీజేపీ 49వ డివిజన్ అధ్యక్షుడిగా సిరిపురం పవన్‌ను నియమించినట్లు ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

శైలజకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పోకల శైలజకు హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ (జేఎన్‌టీయూ) డాక్టరేట్ ప్రకటించింది. నోవెల్ సెక్యూర్ మల్టీపాథ్ రోటింగ్ ఆల్గారిథం ఫర్ మొబైల్ అడహక్ నెట్‌వర్క్స్ (మ్యానెట్స్) అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి శైలజకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు జేఎన్‌టీయూ డైరెక్టర్ డాక్టర్ అరుణకుమారి తెలిపారు. అనంతసాగర్‌లోని ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ అండ్ డైరెక్టర్ డాక్టర్ సివి గురురావు పర్యవేక్షణలో శైలజ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

సర్వాయి పాపన్న జయంతి వేడుకలను నిర్వహించాలి

హన్మకొండ: సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని ఈనెల 18న గ్రామగ్రామాన ఘనంగా జరుపుకోవాలని సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ వడ్లకొండ వేణుగోపాల్ సూచించారు. పాపన్న జయంతి రోజును ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 18న రవీంద్రభారతిలో అధికారికంగా నిర్వహించనున్న పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమానికి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి గౌడ, బీసీ, ఎస్సీ, ఎస్టీలు తరలిరావాలని కోరారు.

యువతి అదృశ్యం

రామన్నపేట: వరంగల్ డీఎంహెచ్ఓ కార్యాలయ సమీపంలోని సత్యసాయి అపార్ట్‌మెంట్‌లో నివాసముండే 26 సంవత్సరాల యువతి కందగట్ల సునీత అదృశ్యమైనట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు. యువతి తండ్రి సురేశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. యువతి శుక్రవారం ఉదయం 10గంటలకు వెళ్లి తిరిగి రాకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధి ఎస్ఆర్ఆర్ తోటలో ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వరంగల్ కరీమాబాద్ ఎస్ఆర్ఆర్‌తోటలో చెందిన కంచి దేవరాజు, పావని పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నారు. రోజూ మాదిరిగానే గురువారం రాత్రి ఇంట్లో భోజనం చేసి నిద్రించిన దేవరాజు శుక్రవారం తెల్లవారుజామున కనిపించ లేదు. దీంతో బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీలేదు. ఈనేపథ్యంలో కంచి పావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మడికొండ: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మడికొండ శివారు సోమిడిలో చోటు చేసుకుంది. మడికొండ ఎస్సై రాజబాబు తెలిపిన వివరాల ప్రకారం కాజీపేట మండలం సోమిడి గ్రామానికి చెందిన కాగిత రాంచందర్ (37) ఆర్థిక ఇబ్బందులతో గురువారం ఉదయం సోమిడి శివారులో క్రిమిసంహారక మందు తాగి పడిపోయాడు. స్థానికులు వెంటనే గమనించి చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. మృతుడి తండ్రి అయిలయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంగు ఉపేంద్రశర్మకు సన్మానం

హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల దేవాలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని దేవాలయంలో ఆలయ సిబ్బంది ఆయనను శుక్రవారం సన్మానించారు. దేవాలయ అర్చకులు సందీప్‌శర్మ, శ్రవణ్‌కుమార్ దేవాదాయ శాఖ సిబ్బంది రామకృష్ణ పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణమాస పూజలు



రుద్రేశ్వరుడు



లక్ష్మీదేవి



భద్రకాళి అమ్మవారు



మెట్టుగుట్టపై పూజ చేస్తున్న భక్తులు



కాశిబుగ్గ కాశీ విశ్వేశ్వరాలయంలో హోమం



కాజీపేట శ్వేతార్క ఆలయంలో వరలక్ష్మీ వ్రతం



హసన్‌పర్తి: రాజరాజేశ్వరస్వామి ఆలయంలో..

వరంగల్ కల్చరల్: శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా పలు ఆలయాల్లో భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేయి స్తంభాల దేవాలయంలో స్వామివారికి సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని అర్ధనారీశ్వర రూపంలో అలంకరించారు. భద్రకాళి దేవాలయాన్ని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ దర్శించుకుని పూజలు చేశారు. ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి దేవి దేవాలయంలో ఆలయ అర్చకుడు లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు జరిగాయి. ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. హంటర్‌రోడ్డులోని సంతోషిమాత దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మెట్టుగుట్టపై వరలక్ష్మీ వ్రతం, కుంకుమార్చన

మడికొండ: మడికొండలోని మెట్టుగుట్టపై ఉన్న సీతారామచంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం, కుంకుమార్చన, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వాహణాధికారి కే.శేషుభారతి, ఆలయ చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనచార్యులు, పారుపల్లి సత్యనారాయణశర్మ, ధర్మకర్తలు బైరి రాజుగౌడ్, రొద్ద దయాకర్, దండిగం శ్రీనివాస్, వస్కుల ఉమ, బోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరాలయంలో చండీహోమం

కాశిబుగ్గ: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని గ్రేటర్ వరంగల్ 20వ డివిజన్ కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో శనివారం చండీహోమాన్ని నిర్వహించారు. ఆలయ ఆవరణలోని యాగశాలలో రెండు హోమ గుండాల్లో హోమం నిర్వహించారు. హోమంలో ఓరుగంటి కొమురయ్య, బోడకుంట్ల వైకుంఠం, బొమ్మగాని కృష్ణమూర్తి, నాగమళ్ల ఓంకారేశ్వర్, సారంగపాణి, సతీష్, దయాసాగర్, జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్వేతార్కలో శ్రావణమాస పూజలు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దేవాలయ ఆవరణలో మహాలక్ష్మి అమ్మవారికి శ్రావణ శుక్రవారం పూజలను భక్తులు నిర్వహించారు. మహాలక్ష్మీ దేవిని మహిళలు ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు సామూహిక వరలక్ష్మి వ్రతాలు జరిపించారు. భక్తులతో సాయికృష్ణ శర్మ అష్టోత్తర పూజలు చేయించారు.

హసన్‌పర్తిలో సామూహిక వ్రతం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.

అత్యాచార నిందితులను శిక్షించాలి



హన్మకొండ: నిరసన తెలుపుతున్న నాయకులు

హన్మకొండ: కోల్‌కత్తలోని మెడికల్ పీజీ విద్యార్థినిపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏబీఎస్ఎఫ్, స్వేరోస్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి మమత బెనర్జీ స్పందించి నిందితులను కఠినంగా శిక్షించి మహిళలకు న్యాయం చేయాలని కోరారు. చక్రి, సునీల్, మహేందర్, వినయ్, రాజేష్, పృథ్వీ, రాజు, శేఖర్, ప్రశాంత్, రఘు పాల్గొన్నారు.

నేర వ్యవస్థను అరికట్టాలి

న్యూశాయంపేట: కోల్‌కత్తలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి ఆపై హత్య చేసిన నేరస్తులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిందితులను ప్రభుత్వం శిక్షించకుండా చోద్యం చూస్తోందని తెలిపారు. నేర వ్యవస్థను అరికట్టడానికి చట్టాలు తీసుకురావాలని సూచించారు.

లైబ్రరీ సైన్స్‌తో ఉపాధి అవకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న రాంచంద్రం

కేయూ క్యాంపస్: లైబ్రరీ సైన్స్‌తో అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య డైరెక్టర్ ప్రొఫెసర్ రాంచంద్రం తెలిపారు. విశ్వవిద్యాలయ లైబ్రరీ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ రాధికారాణి అధ్యక్షతన ఎంఎల్ఐఎస్సీ (రెగ్యులర్) కోర్సు విద్యార్థులు శుక్రవారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో రాంచంద్రం మాట్లాడారు. విద్యార్థుల సమగ్ర మూర్తిమత్వ నిర్మాణానికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు. తెలంగాణ విశ్వవిద్యాలయం లైబ్రరీ సైన్స్ విభాగం అధ్యాపకులు డాక్టర్ సంపత్ మాట్లాడుతూ విద్యార్థులను గొప్ప వ్యక్తులుగా తీర్చిదిద్దే ప్రదేశం గ్రంథాలయం అని కొనియాడారు. కార్యక్రమంలో కేయూ లైబ్రరీ సైన్స్ అల్యూమ్నీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

గొప్ప రాజనీతిజ్ఞుడు వాజ్‌పేయి



కాశిబుగ్గ: వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు



ఖిలా వరంగల్: జక్కలొద్దిలో..

కాశిబుగ్గ: భారత మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి గొప్ప రాజనీతిజ్ఞుడని బీజేపీ నేత సముద్రాల పరమేశ్వర్ కొనియాడారు. పార్టీ ఆధ్వర్యంలో కాశిబుగ్గ జంక్షన్‌లో వాజ్‌పేయి వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పరమేశ్ మాట్లాడుతూ ప్రధాని వాజ్‌పేయి దేశానికి విశేష సేవలు అందించారని గుర్తుచేశారు. త్వరలో కాశిబుగ్గ జంక్షన్‌లో వాజ్‌పేయి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పోలెపాక మార్టిన్ లూథర్, సిద్దోజు శ్రీనివాస్, కోట సతీష్, రాఘవచారి, తిలక్, బొడ్డు రాకేష్, హరీష్, ప్రభాకర్, బ్రహ్మాచారి పాల్గొన్నారు.

అటల్ బిహరీ వాజపేయికి ఘన నివాళి

ఖిలా వరంగల్: భారతరత్న అవార్డు గ్రహీత, మాజీ ప్రధాని అటల్ బిహరీ వాజపేయి వర్ధంతిని వరంగల్ జక్కలొద్దిలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బన్న ప్రభాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అజయ్, అభిలాష్, కిరణ్, మోరే రాకేష్, రమేష్, శ్రీను, రాజేష్, శ్రీధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పవిత్రతకు గుర్తుగా రాఖీ కంకణం



కాజీపేట రూరల్: మనో వికారాల నుంచి రక్షణ పొందడమే అసలైన రక్షాబంధన్ అని, పవిత్రతకు గుర్తుగా రాఖీ కంకణాన్ని కట్టుకుంటారని, ఇదే రక్షా బంధన్ ఆధ్యాత్మిక రహస్యమని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కాజీపేట శాఖ నిర్వాహకురాలు శ్రీదేవి తెలిపారు. రాంపూర్‌లోని సాక్షి దినపత్రిక యూనిట్ కార్యాలయంలో సిబ్బందికి శుక్రవారం రాఖీలు కట్టారు. ఈనెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు సుమారు వేయి మందికి రాఖీలు కట్టినట్లు శ్రీదేవి వివరించారు.

కేయూలో ఉద్యోగులకు..

కేయూ క్యాంపస్: రక్షాబంధన్‌ను పురస్కరించుకొని కేయూ పరిపాలన భవనంలోని ఉద్యోగులకు కాజీపేటలోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయానికి చెందిన బ్రహ్మకుమారి శ్రీదేవి, సిబ్బంది రాఖీలు కట్టారు.

న్యాయవాదులకు అండగా కాంగ్రెస్



మురళికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న న్యాయవాదులు

కాశిబుగ్గ: వరంగల్‌లోని న్యాయవాదుల సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు అన్నారు. ఇటీవల ఎన్నికైన వరంగల్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్, రాష్ట్ర లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ ముదసిర్ అహ్మద్, కొక్కొండ రమేష్‌తోపాటు వైస్ చైర్మన్లు, జాయింట్ కన్వీనర్ల ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు మురళీధర్‌రావును ఓసిటీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆనంద్ మోహన్, జి.శ్రీనివాస్‌గౌడ్, జి.వెంకటరమణ, జి.హరిహర కుమార్, అమృతరావు, ఆజాం, సుఖేష్, శ్రీకాంత్, జి.శ్రీధర్, పరమేశ్వర్, ఎం.పరశురాములు, కృష్ణ, రాజు, ఆనంద్ ఉన్నారు.

వినతుల స్వీకరణ

కాశిబుగ్గ: ఓసిటీలోని తూర్పు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు ప్రజల నుంచి శుక్రవారం వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటామని చెప్పారు.

సైబర్ నేరాలపై అవగాహన

మడికొండ: మడికొండ ఎస్సై రాజబాబు ఆధ్వర్యంలో ఇండస్ట్రీయల్‌లోని తేజస్వి అప్పెరల్ పార్కులో మహిళా కార్మికులకు సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజబాబు మాట్లాడుతూ సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. సైబర్ మోసగాళ్ల వలలో పడొద్దని అన్నారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలని ఎస్సై సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ జయరాజ్, కానిస్టేబుల్ రాకేష్, గోవర్ధన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

19నుంచి రాఘవేంద్ర స్వామి మఠంలో ఆరాధనోత్సవాలు



పరిమళ కాలనీలోని రాఘవేంద్ర మఠం

హన్మకొండ: హనుమకొండ పరిమలకాలనీలోని రాఘవేంద్ర మఠంలో 353వ ఆరాధనోత్సవాలకు ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఈనెల 19నుంచి 22వ తేదీ వరకు ఆరాధానోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కర్నూలు జిల్లా మంత్రాలయంలో రాఘవేంద్ర స్వామి సశరీరంగా బృందావన ప్రవేశం చేసి 353ఏళ్లు అవుతున్న క్రమంలో ఆరాధానోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హనుమకొండ పరిమల కాలనీలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠం గౌరవ విచారకర్త డీవీఎం ప్రభాకర్ రావు, మేనేజర్ బి.వేణుమాధవ్ రావు మాట్లాడుతూ వైభవంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మల దహనం



పోచమ్మమైదాన్‌లో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వరంగల్: మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్ ప్రయాణం సౌకర్యం కల్పిస్తే ఓర్వలేని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. మహిళలను కించపరుస్తూ బస్సులో బ్రేక్ డాన్సులు, రికార్డింగ్ డాన్సులు చేయండి అంటూ అత్యంత అవహేళనగా మాట్లాడి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ విమర్శించారు. ఈమేరకు వరంగల్ పోచమ్మమైదాన్ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ఎంబాడి రవీందర్, కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, మాజీ కార్పొరేటర్లు కత్తెర లక్ష్మణ్, దూపం సంపత్, జన్ను రవి, ఓబీసీ జనరల్ సెక్రటరీ వరుణ్, యూత్ కాంగ్రెస్ పరమేష్, గిన్నారపు రాజు, జన్ను ఆదాం, చంద్రమౌళి పాల్గొన్నారు.

అశోక జంక్షన్‌లో..

హన్మకొండ చౌరస్తా: మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తక్షణమే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని అశోక జంక్షన్‌లో నిరసన తెలిపారు. వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

మడికొండ చౌరస్తాలో..

మడికొండ: మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను మడికొండ చౌరస్తాలో శుక్రవారం దహనం చేశారు. కాజీపేట కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నాయకులు బైరి లింగమూర్తి గౌడ్, వస్కుల శంకర్, వస్కుల ఉమ, పైడిపాల రఘుచందర్, బిల్ల రవీందర్, గుర్రం అమర్‌నాథ్, బైరి రజిని, వేణుయాదవ్, ఉబ్బని రమ, వస్కుల నాగరాజు, శివ, నమిండ్ల రాజు, ముచ్చ అర్జున్, బోగి ఉదయ్, సాంబరాజు, బైరి రాజుగౌడ్, వెంకన్న, నరేష్ పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి: మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో హసన్‌పర్తి సెంటర్‌లో దహనం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగళ్లపల్లి తిరుపతి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కనపర్తి కిరణ్, ఆరెల్లి వెంకటస్వామి, మాజీ సర్పంచ్ పుల్లా రవీందర్, మహిళా కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షురాలు బత్తుల స్వాతి, నాయకులు పోతరాజు ప్రభాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కాశిబుగ్గ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే సగం వ్యాధులు దరిచేరవని 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ అన్నారు. బల్దియా ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు, తడిచెత్త, పొడిచెత్త, ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రతపై స్పందన జానపద కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా స్వచ్ఛ ఆటోల్లో వేయాలని పేర్కొన్నారు. అలాగే ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించాలని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ధరమ్‌సింగ్, సతీష్, రాజు, కాంగ్రెస్ నాయకులు కుసుమ సతీష్‌బాబు, బాలరాజు, మక్బూల్, చంద్రశేఖర్, గోవర్ధన్ పాల్గొన్నారు.

సుర్జీత్‌నగర్‌ను అభివృద్ధి చేయాలి



కాజీపేట అర్బన్: 31వ డివిజన్‌లోని సుర్జీత్‌నగర్ అభివృద్ధికి కేటాయించిన నిధులను దారి మళ్లించకుండా తమ కాలనీ అభివృద్ధికే వినియోగించాలని సుర్జీత్‌నగర్ వ్యవస్థాపక అధ్యక్షుడు కారు ఉపేందర్ కోరారు. ఈమేరకు న్యూశాయంపేటలోని కార్యాలయంలో కార్పొరేటర్ మామిండ్ల రాజును కాలనీవాసులతో కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ 20 ఏళ్లుగా సుమారు 500 కుటుంబాలు సుర్జీత్‌నగర్‌లో నివాసం ఉంటున్నాయని చెప్పారు. ఇప్పటి వరకు కనీస సౌకర్యాలు లేవని పేర్కొన్నారు.

పూజారులకు రూ.6 వేల వేతనం ఇవ్వాలి


నయీంనగర్: గ్రామ పూజారులకు ధూపదీప నైవేద్యం కింద ప్రభుత్వం రూ.6 వేల వేతనం ప్రకటించాలని జగదాంబ మేడారం భద్రకాళి పూజారుల సంఘం జాతీయ గౌరవ అధ్యక్షుడు కుడికల ఆంజనేయులు కోరారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పూజారులకు గుర్తింపు పత్రాలను మంజూరు చేయాలని, ప్రభుత్వమే స్థలం కేటాయించి గుడి కట్టించి ఇవ్వాలని సూచించారు. బ్రాహ్మణులతో సమానంగా సముచిత గౌరవం కల్పించి, దేవాదాయ శాఖలో ఉద్యోగావకాశాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుగులోతు కిషోర్, పుష్పితాలయ, సాధు పాల్గొన్నారు.

స్వధార్ మహిళలకు చీరల పంపిణీ



హన్మకొండ: హనుమకొండ కేఎల్ఎన్ రెడ్డి కాలనీలోని స్వధార్ ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న మహిళలకు అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని ఆశ్రమంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆశ్రమ మహిళలకు సొసైటీ అధ్యక్షురాలు కె.అనితారెడ్డి చీరలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ్రయం పొందుతున్న మహిళలు స్వయం ఉపాధి శిక్షణలో రాణించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని అన్నారు. కార్యక్రమంలో స్వధార్ ఆశ్రమ బాధ్యురాలు శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు శుభాకాంక్షలు



హసన్‌పర్తి: పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి వి.చేరాలును హసన్‌పర్తి మండలానికి చెందిన మాజీ సర్పంచ్‌లు, నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, రెడ్డి సంఘం జిల్లా కార్యదర్శి టీఆర్ కేరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మల్లారెడ్డి, కాంట్రాక్టర్లు పెద్ది మల్లారెడ్డి, శ్రీనివాస్, కుమారస్వామి, బండారు సుమన్, దేవస్థాన ధర్మకర్త రాజు, కాలె యాదగిరి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు రావాలని ఆహ్వానం

ఖిలా వరంగల్: మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావును కాశికుంట కట్టమైసమ్మ ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం కలిశారు. ఈనెల 19నుంచి 22వరకు జరగనున్న కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనకు రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కావేటి శంకర్, ప్రధాన కార్యదర్శి అచ్చ వినోద్‌కుమార్, సవరం రంజిత్, పింగిలి యాకయ్య, ఆడెపు లక్ష్మణ్, రంజిత పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

న్యూశాయంపేట: ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని టీఎస్ – మెసా (తెలంగాణ మైనారిటీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోషియేషన్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ఏ.ఫారూఖ్ అహ్మద్, తోఫిఖుర్ రహమాన్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మైనారిటీ ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించాలని సూచించారు.

ఎమ్మెల్సీలకు అభినందనలు




హన్మకొండ: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేసిన ప్రొఫెసర్ కోదండరాం, అన్వర్ అలీకి పలువురు అభినందనలు తెలిపారు. ఈమేరకు ఆయనను సామాజిక, ఆర్థికవేత్త ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్‌కు..

న్యూశాయంపేట: సియాసత్ న్యూస్ ఎడిటర్ అమీర్ అలీఖాన్ ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయడంపై టీపీసీసీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు జమాల్‌షరీఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా మైనారిటీ సెల్ నాయకులు శుక్రవారం సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఖలీద్ సయిద్, రఫీ, మతిన్, నాజీం అలీ, అబ్దుల్ మన్నాన్, రజీ, రహీం, తదితరులు పాల్గొన్నారు.


రైల్వే పెన్షనర్ల సంక్షేమానికి కృషి



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న నాయకులు

కాజీపేట రూరల్: కాజీపేట డీజిల్‌కాలనీ రిటైర్డ్ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు అన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ అసిస్టెంట్ సెక్రటరీ సత్యవరం వెంకటేశ్వర్లు (నేత) పుట్టినరోజు వేడుకలను అసోసియేషన్ అడ్డా వద్ద గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లును సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ రాజు, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసునూరి మనోహర్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ఎస్.రామస్వామి, ఎస్.నర్సయ్య, నాయకులు ఇమ్మడి బాబు, సందెల విజయ్‌కుమార్, సత్యవరం మధుకర్, కాసర్ల నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డుల ప్రదానం



హన్మకొండ కల్చరల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ రిటైర్డ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిద్దోజు విద్యాసాగర్‌ను పలువురు శుక్రవారం అభినందించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంత్రి కొండా సురేఖ నుంచి ఆయన ప్రశంస పత్రం అందుకున్నారు.

డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు..



పేదవారికి ఉచితవైద్యం, రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవలందిస్తున్న డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సోషల్ వర్కర్ అవార్డును మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అందజేశారు.